సమస్యలతో సహవాసం

- పరవాడ మండలంలో సమస్యల తిష్ట
- తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, కాలం తీరిన వంతెనలతో ఇబ్బందులు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని ఆవేదన

పరవాడ మండలంలోని పలు గ్రామాల ప్రజలు తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, కాలం తీరిన వంతెనలు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్యలున్నా, పరిష్కారం కోసం అధికారులు కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సమస్యలతోనే సహవాసం చేస్తున్నారు.

– పరవాడ

స్వచ్ఛమైన నీరు లేక..


ప్రారంభానికి నోచుకోని మంచినీటి పథకం



ఎన్టీపీసీ బూడిద చెరువుల ఏర్పాటుతో గ్రామంలో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. తాగడానికి స్వచ్ఛమైన నీరు దొరకదు. దప్పిక తీర్చుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెన్నలపాలెం ఆర్వో ప్లాంటుకు పరుగులు తీయాలి. ప్రజా అవసరాల కోసం రూ.22 లక్షలతో కలపాకలో నిర్మించిన మంచినీటి పథకం పూర్తయి, మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. తాగునీటి అవసరాలను గుర్తించి, మంచినీటి పథకాన్ని ప్రారంభించాలి.

– సత్యవతి, గృహిణి, కలపాక

బోరుబావి లేక ఇబ్బంది



టిడ్కో గృహ సముదాయంలో బోరు బావి లేదు. కుళాయి నీరున్నా పూర్తి స్థాయిలో సరిపోవడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నాం. అధికారులకు మొర పెట్టుకున్నా చర్యలు తీసుకోవడం లేదు. ఇక్కడ 512 ఇళ్లు ఉన్నాయి. కాలనీ ప్రజల ఇబ్బందులు గుర్తించి బోరు ఏర్పాటు చేయాలి.

– అన్నపూర్ణ, గృహిణి, టిడ్కో కాలనీ


టిడ్కో గృహ సముదాయం

దారి పొడవునా గోతులే..



అధ్వానంగా మారిన వాడచీపురుపల్లి–పరవాడ రహదారితో అవస్థలు పడుతున్నాం. దారి పొడవునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. చీకటి పడితే రోడ్డులో రాకపోకలు చాలా కష్టంగా ఉంది. మరమ్మతులు చేపట్టి ఏడాది తిరక్కముందే రహదారి శిథిలమైంది. రోడ్డుపై గోతుల్లో పడి పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు.

–చిననాగేశ్వరరావు, వాడచీపురుపల్లి


అధ్వానంగా ఎన్టీపీసీ రోడ్డు

వంతెన శిథిలం



వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. శిథిల వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. గతంలో రోడ్డు విస్తరణలో వంతెనను అభివృద్ధి చేయాలని కోరాం. అధికారులు పట్టించుకోలేదు. శిథిల వంతెనపై రెండు వైపులా రెయిలింగ్ కూలిపోయింది. చీకటి పడితే వంతెనపై నుంచి ప్రయాణించడం భయంగా ఉంటోంది. ఇరుగ్గా మారిన వంతెనపై భారీ వాహనాల రాకపోకలు కష్టమవుతున్నాయి.

– వాసుపల్లి కొర్లయ్య, గంగపుత్రుడు, ముత్యాలమ్మపాలెం


ముత్యాలమ్మపాలెం ఆలయం వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన

ఎగసిపడుతున్న ధూళి



నిత్యం వందల సంఖ్యలో బూడిద, బొగ్గు లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఎగసిపడుతున్న ధూళితో అనారోగ్యాలకు గురవుతున్నాం. ధూళిని పీల్చడం వల్ల గొంతు, కళ్ల మంటలు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. బూడిద ఎగిరిపడడం వల్ల రోడ్ల పక్కన చిన్న చిన్న పాన్‌షాపులు, కిరాణా, టిఫిన్ సెంటర్లు నడుపుకుంటున్న వ్యాపారులం తీవ్రంగా నష్టపోతున్నాం. రహదారుల్లో ధూళి ఎగరకుండా చర్యలు తీసుకోవాలి.

–పి.నూకరాజు, పాన్‌షాపు యజమాని, రాంకీ కూడలి


ఎన్టీపీసీ కారిడార్ రహదారిలో ఎగసిపడుతున్న ధూళి

అంధకారంలో పీహెచ్‌సీ





మా గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బయట విద్యుత్ దీపాలు లేవు. 24 గంటలూ పని చేసే పీహెచ్‌సీ ఇది. రాత్రి వేళల్లో పీహెచ్‌సీకి వెళ్లాల్సి వస్తే భయంగా ఉంటోంది. విద్యుత్ దీపం లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణలోకి విషజంతువులు ప్రవేశిస్తున్నాయి. వాటికి భయపడి సిబ్బంది కూడా బయటకు రావాలంటే హడలిపోతున్నారు. ఆస్పత్రిలో విద్యుత్ దీపాన్ని ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. – పెదపూడి అప్పలరాజు, వాడచీపురుపల్లి

డ్రైనేజీలు అధ్వానం



దేశపాత్రునిపాలెం గ్రామంలో మురుగు కాలువలను అభివృద్ధి చేయాలి. గాజువాక–పరవాడ రహదారిలో జాజులవానిపాలెం వరకు ఏర్పాటు చేసిన కాలువ, మెయిన్ రోడ్డు మలుపులోని కాలువలు అధ్వానస్థితిలో ఉన్నాయి. కాలువల్లో మురుగునీరు నిలిచిపోవడంతో దుర్గంధం భరించలేకపోతున్నాం. దోమలు విపరీతంగా పెరిగిపోయి అవస్థలు పడుతున్నాం. మురుగు కాలువలను సీసీ కాలువలుగా అభివృద్ధి చేయాలి.

– శనివాడ ప్రకాష్, దేశపాత్రునిపాలెం


దేశపాత్రునిపాలెంలో మురుగు కాలువలు ఇలా..

క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మృతుని కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేత


మృతుని భార్యకు చెక్ అందిస్తున్న గండి బాబ్జీ

పెందుర్తి: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పెందుర్తి వాసి కరక అప్పారావు కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సహాయం అందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ చేతుల మీదుగా రూ.3.40 లక్షల చెక్‌ను మృతుని భార్య కరక సంధ్యకు అందజేశారు. స్థానిక నాయకులు చిరికి అవతారం, దొగ్గ కన్నారావు, చిరికి సూర్యనారాయణ, గొరపల్లి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవంలో అందరూ పాల్గొనాలి


ఉపాధి హామీ కార్మికులతో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ సన్యాసిరావు

పరవాడ: విశాఖ బీచ్‌లో ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఉపాధి హామీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వెన్నలపాలెం ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు పిలుపునిచ్చారు. వెన్నలపాలెంలో ఉపాధి హామీ కార్మికులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక వికాసం పెంపొందుతాయన్నారు. ఉపాధి హామీ కార్మికుల పెండింగ్ వేతనాల సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్పీ వి.గంగునాయుడు, మేట్‌లు, కార్మికులు పాల్గొన్నారు.

బంగార్రాజుకు నివాళులు


బంగార్రాజు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఇటీవల హత్యకు గురైన జనసేన కార్యకర్త మైలపల్లి బంగార్రాజుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు నివాళులర్పించారు. బంగార్రాజు పెదకర్మ సందర్భంగా, వారి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న బంగార్రాజు హత్యకు గురికావడంతో అతని ఉద్యోగాన్ని భార్యకు కేటాయించి, పిల్లలకు బాలభారతి పబ్లిక్ స్కూల్లో ఉచిత అడ్మిషన్ కల్పించాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు. జనసేన పార్టీ తరఫున బంగార్రాజు కుటుంబానికి రూ.2లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. పార్టీ మండల అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు మృతుడి కుటుంబానికి రూ.50 వేల సాయం అందించేందుకు ముందుకొచ్చారు.

రైల్వే న్యూ కాలనీలో కార్డన్ సెర్చ్

సీతంపేట: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే న్యూకాలనీ ప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈస్ట్ సబ్ డివిజన్ సిబ్బంది సాయంతో సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొని తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వాహనాలు, వ్యక్తులను, ఇళ్లను అణువణువూ పరిశీలించారు. దుకాణాల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. అనుమానిత వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

సింహాచలేశునికి స్వర్ణ తులసీ దళార్చన


స్వర్ణతులసీ దళాలతో స్వామికి అర్చన


నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఉదయం 7గంటల నుంచి స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుదీర్చి, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

పరవాడ: రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాలు కూడలిలో శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం దృష్ట్యా లేబర్ కోడ్స్ అమలును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ల కళ్లల్లో సంతోషం చూడడం కోసం కార్మిక హక్కులను పణంగా పెట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను ఏకపక్షంగా రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తేవడంలోనే ప్రభుత్వ కార్పొరేట్ విధేయత స్పష్టమవుతోందన్నారు. కార్మిక వర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమన్నారు. ధరలు పెరిగి జీవన ప్రమాణాలు పడిపోతున్న సమయంలో పనిగంటలు తగ్గించి, అదనపు ఉపాధి కల్పించాల్సింది పోయి నిరుద్యోగాన్ని పెంచే ఈ చర్య అభివృద్ధికి నిరోధకమని పేర్కొన్నారు. తక్షణమే లేబర్ కోడ్‌లను, దాని అనుబంధ నిబంధనలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా జూలై 9న జరగనున్న జాతీయ సమ్మెలో కార్మిక వర్గం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిహెచ్.వెంకునాయుడు, కె.అర్జున్, ఎన్.గురునాథరావు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్‌లో ఓసీటీ పరికరం ప్రారంభం


ఓసీటీ పరికరాన్ని ప్రారంభిస్తున్న విశాఖ పోర్టు ట్రస్ట్ డీజీఎం

సింహాచలం: నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో కొత్తగా సమకూర్చిన అత్యాధునిక ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ పరికరాలను విశాఖ పోర్టు ట్రస్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే శనివారం ప్రారంభించారు. ఆప్టికల్ కోహరెన్స్ టోమోగ్రఫీ అనే పరికరం ద్వారా కంటి రెటీనా యొక్క అధిక రిజల్యూషన్ క్రాస్ సెక్షనల్ చిత్రాలను తీసేందుకు ఉపయోగించే నాన్ ఇన్వాసివ్ ఇమేజింగ్ టెక్నాలజీ కలిగి ఉందని ఆస్పత్రి జనరల్ మేనేజర్ బంగార్రాజు తెలిపారు. గ్లకోమా, డయాబెటిస్, రెటీనోపతి తదితర కంటి పరిస్థితులను నిర్ధారించడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డీజీఎం కె.రాధాకృష్ణన్, డీజీఎం వి.రమేష్‌కుమార్, రెటీనా విభాగం హెచ్‌వోడీ డాక్టర్ టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం బస్టాండ్‌లో రిమోట్ కంట్రోల్ ఫ్యాన్లు


ఏర్పాటు చేసిన ఫ్యాన్

సింహాచలం: సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రిమోట్ ద్వారా ఆపరేట్ చేసే ఆరు బీఎల్‌డీసీ మోటారు ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ ఎస్.శరత్ బాబు తెలిపారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్సర్వేషన్ మిషన్ సౌజన్యంతో ఆటంబర్గ్ కంపెనీ ఈ ఫ్యాన్లు అందించిందన్నారు. ఈ ఫ్యాన్ల ద్వారా విద్యుత్ కూడా ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ రమణమూర్తి, సూపరింటెండెంట్ కుమారి పాల్గొన్నారు.

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి అభినందనీయం

అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్



వర్క్‌షాపులో పాల్గొన్న బాలికలతో అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు సంగీత కౌశిక్, సమీర్‌శర్మ తదితరులు

పరవాడ: బాలికా సాధికారతకు సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం తీసుకున్న చొరవ అభినందనీయమని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ఈ విభాగం ఆధ్వర్యంలో గత నెల 9న ప్రారంభమైన బాలికా సాధికారత మిషన్–2025 వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు విద్య నేర్పించడం ఎంత అవసరమో వివరించారు. బాలికల వ్యక్తిత్వంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎన్టీపీసీ కార్పొరేట్ ప్లానింగ్ ఈడీ సంగీత కౌశిక్ మాట్లాడుతూ బాలికల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్న సంస్థ చొరవను కొనియాడారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్ శర్మ మాట్లాడుతూ గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ ద్వారా బాల బాలికలకు యోగా, కరాటే, కంప్యూటర్, నృత్యం, స్పోకెన్ ఇంగ్లిష్, వ్యక్తిత్వ వికాసం, చిత్రలేఖనం తదితర అంశాల్లో నిపుణులతో ప్రత్యేక శిక్షణ ఇప్పించామన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న 120 మంది బాలికలకు అవసరమైన సదుపాయాలను కల్పించడం కోసం సంస్థ రూ.50 లక్షలను వెచ్చించిందన్నారు. ఈ మిషన్‌లో బాలికలకు మార్గదర్శకాలను అందించిన ఉద్యోగులను ఈడీ అభినందించారు. కార్యక్రమంలో బాలికల నృత్యాలు, ఆపరేషన్ సిందూర్, యోగా, కరాటే వంటి ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన అవసరం


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణుస్వరూప్

సబ్బవరం: రహదారి భద్రతపై విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్స్ అవగాహన కలిగి ఉండాలని, ఈ విషయాలను మరింతమందికి తెలియజేయాలని డీఎస్పీ విష్ణు స్వరూప్ సూచించారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం–6లో భాగంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపే సమయంలో భద్రతా ప్రమాణాలను, నిబంధనలను పాటించకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడంతో యువత ప్రధానంగా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ జి.రామచంద్రరావు, పలు కళాశాలలు, పాఠశాలల నుంచి వచ్చిన ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మాదకద్రవ్యాల వినియోగం ద్వారా శారీరక, మానసిక సమస్యలతో పాటు నేర ప్రవర్తనలు సమాజ పతనానికి దారి తీస్తాయని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా దేశపాత్రునిపాలెంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాను అరికట్టేందుకు ప్రజల సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఈగిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు పిళ్లా శివకృష్ణ, రామారావు, శ్రీనివాస్ ఈగిల్ కానిస్టేబుల్ ఎస్.కేశవరావు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత


పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఐ రామచంద్రరావు తదితరులు

సబ్బవరం: మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సీఐ జి.రామచంద్రరావు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో శనివారం మొక్కలు నాటారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు అమ్మపేరుతో మొక్క కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మరింతమంది మొక్కలు నాటే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ దివ్య, గొటివాడ సామ్రాట్ కుమార్, బీజేపీ మండల కన్వీనర్ రెడ్డి రామునాయుడు, నేతలు మండల చక్రవర్తి, భూపతి అప్పారావు, ఆకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్


చినముషిడివాడ మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పెందుర్తి: బక్రీద్‌ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చినముషిడివాడలోని మజీద్ ఏ నూరాని మసీదులో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పెందుర్తి పాతూరులోని మస్జిద్ ఏ రజాయే మసీదుతో పాటు సరిపల్లి, పులగానిపాలెం, సప్తగిరినగర్, వేపగుంట మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం పెద్దలు షేక్ బృహాన్, సాకీర్, షేక్ బాబాలాల్, షేక్ సైదు, షేక్ షఫీఉల్లా, షేక్ రహిమాన్, మహమ్మద్ హుస్సేన్ రిజ్వి, షేక్ కరీముల్లా, షేక్ ఇబ్రహీం, షేక్ మదీనా, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రార్థనల్లో పాలుపంచుకున్నారు.